# మదర్ థెరిస్సా స్ఫూర్తితోనే సామాజిక సేవలు

**మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా బాలింతలకు పండ్లు పంపిణీ -చేపూరి శంకర్**



**విశ్వంభర, వనస్థలిపురం :** మదర్ థెరిస్సా స్ఫూర్తితోనే సామాజిక సేవ చేయడం అలవరుచుకున్నాను అని వనస్థలిపురానికి చెందిన సామాజిక కార్యకర్త, మదర్ థెరిస్సా చారిటబుల్ వ్యవస్థాపక అధ్యక్షులు చేపూరి శంకర్ అన్నారు. బుధవారం మదర్ తెరిస్సా 116వ జయంతిని పురస్కరించుకొని వనస్థలిపురంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి వనస్థలిపురం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి నాగేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.కార్యక్రమం ప్రారంభంలో డాక్టర్ బి నాగేందర్, చేపూరి శంకర్ కలిసి మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేందర్ మాట్లాడుతూ.. సమాజంలో నిరుపేదలకు, అనాథలకు మదర్ థెరిస్సా చేసిన నిస్వార్థ సేవలు అమూల్యమైనవని, ఆమె సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేద బాలింతల ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ.. వారికి పౌష్టికాహారం (తాజా పండ్లు) అందించడానికి ముందుకు వచ్చిన చేపూరి శంకర్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

అలాగే విశ్వంభర దినపత్రిక ప్రతినిధితో చేపూరి శంకర్ మాట్లాడుతూ సొసైటీని 2009లో ఏర్పాటు చేసి 150 మంది సభ్యులతో కలిసి స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కర్నూల్ వరదల సమయంలో వారికి నిత్యవసర సరుకులు పంపించడం జరిగింది. స్వైన్ ఫ్లూ సమయంలో కూడా ప్రైమరీ స్కూల్లో విద్యార్థులకు గవర్నమెంట్ వారి సహకారంతో 5000 మంది విద్యార్థులకు మెడిసిన్ అందజేశాము. కరోనా కష్టకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పుడు మనిషిని మనిషిని తాకకుండా దూరం దూరం ఉన్నప్పుడుమా సంస్థ ముందుండి 10,000 మంది పైగా టీకాలు వేయించడం, వృద్ధులకు ప్రత్యేకంగా కారులో తీసుకెళ్లి వారికి టీకాలు వేయించారు. 2000 మంది ఉచితంగా కిట్స్ కూడా ఇవ్వడం జరిగింది.తీవ్రమైన ఎండల్లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు వాటర్ బాటిల్స్, మజ్జిగ ప్యాకెట్స్ పంపిణి చేసాము. గత సంవత్సరం ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలో కురిసిన అకాల వర్షం వల్ల సర్వం కోల్పోయిన ప్రజలకు అండగా నిలిచి నిత్యవసర సరకులు పంపిణి చేశారు. భారతదేశంలో తలసేమియా బాధితులు రోజుకు 12,000 మంది మరణిస్తున్నారు. రక్తం కొరతను దృష్టిలో ఉంచుకొని ప్రతినెల రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రసాద్ శుక్ల చేతుల మీదుగా అత్యుత్తమ రక్తదాన అవార్డు 2026 గవర్నమెంట్ చేతుల మీదుగా తీసుకొని చేపూరి శంకర్ స్వయంగా 25 సార్లు రక్తదానం చేసి ఇప్పటివరకు 40 శిబిరాలు ఏర్పాటు చేశారు . యాక్సిడెంట్ అయిన వారికి హాస్పిటల్లో రక్తం అందకపోతే ఆపరేషన్ టైం లో మాకు నిత్యం ఉస్మానియా హాస్పిటల్, గాంధీ హాస్పిటల్, నిమ్స్ హాస్పిటల్ హాస్పిటల్ మరియు ప్రైవేట్ హాస్పటల్ నుండి మాకు ఫోన్ కాల్స్ రాగానే తక్షణమే స్పందిస్తాం. రక్తం దొరకకపోతే మేము రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ నుండి ఉచితంగా ప్రజలకు అందజేస్తున్నాం.

విద్యార్థులకు, వృద్ధులకు అనాధలకు 50కీ పైగా అన్నదాన కార్యక్రమాలు చేశాము. తలసేమియా బాధితులు ఎవరైనా ఉంటే మా దృష్టికి తెస్తే వారికి ఉచితంగా మెడిసిన్స్, ఉచితంగా బ్లడ్ డోనార్స్ ని ఏర్పాటు చేస్తాము. ఇవన్నీ ఉచితంగా వారికి అందజేస్తాం. మా యొక్క సంస్థ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా ఆరుసార్లు గవర్నర్ ద్వారా ప్రశంసా పత్రం మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ చేతుల మీదుగా,మాజీ సిబిఐ జెడి లక్ష్మీనారాయణ చేతుల మీదుగా, మాజీ గవర్నర్ కొనిశెట్టి రోశయ్య చేతుల మీదుగా గౌరవ ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న ల చేతుల మీదుగాప్రశంసా పత్రాలను అందుకోవడం జరిగింది అని తెలిపారు.




# సర్కార్ బడి బాలికల స్టార్టప్ కంపెనీ

## రూ.1లక్ష పెట్టుబడితో హెయిర్ ఆయిల్ బిజినెస్

## ఇటలీ, ఆస్ట్రేలియాకు ఉత్పత్తులు ఎగుమతి!

**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** బడిలో ఉపాధ్యాయుడు ఇచ్చిన చిన్న ఛాలెంజ్, తల్లి ఇంట్లో తయారుచేసే ఆయుర్వేద కేశ తైలం (హెర్బల్ హెయిర్ ఆయిల్) ఈ రెండూ కలిసి నలుగురు ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులను చిన్న వయసులోనే మహిళా పారిశ్రామికావేత్తలుగా మార్చేశాయి. హరియాణా యమునానగర్ జిల్లా లహర్‌పూర్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన 15 నుంచి 17 సంవత్సరాల వయసున్న నలుగురు బాలికలు సియా, రేణుక, నాన్సీ, దివ్య చదువుకుంటూనే సొంతంగా వ్యాపారం ప్రారంభించారు. హర్వోల్ అనే స్టార్టప్ ప్రారంభించి ఇదే బ్రాండ్ పేరుతో హెర్బల్ హెయిర్ ఆయిల్ బిజినెస్ స్టార్ట్ చేశారు. ఇప్పుడు ఏకంగా ఆస్ట్రేలియా, ఇటలీ వంటి దేశాలకు కూడా తమ ఉత్పత్తుల్ని ఎగుమతి చేస్తున్నారు. చదువుతో పాటు రోజూ సుమా గంట సమయం తమ స్టార్టప్ కోసం కేటాయిస్తున్నారు.

**వీరి ప్రయాణం ఎలా మొదలైందంటే?..**

2025 నవంబర్‌లో ఈ విద్యార్థినుల ప్రయాణం మొదలైంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల్లో వ్యాపార ఆలోచనల్ని ప్రోత్సహించడానికి ఉపాధ్యాయుడు కన్వల్ జీత్ 'కుశాల్ బిజినెస్ ఛాలెంజ్' గురించి వివరించారు. అప్పుడే చిన్న పిల్లల్లో కూడా జుట్టు తెల్లబడటం వంటి సమస్యలు ఎక్కువగా ఉండటాన్ని గమనించిన విద్యార్థిని సియా తన తల్లి రీనా దేవి ఇంట్లో తయారుచేసే మూలికా నూనె (హెర్బల్ ఆయిల్) గురించి ప్రస్తావించింది.

నేచురల్ ఆయిల్‌కు మార్కెట్లో మంచి ఆదరణ ఉంటుందని భావించిన ఆ టీచర్, ఆ హోమ్ రెమెడీని బ్రాండెడ్ ప్రొడక్ట్‌గా మార్చమని ప్రోత్సహించారు. ఈ క్రమంలోనే సహజమైన హెయిర్ ఆయిల్ తయారు చేయాలనే ఆలోచనతో నలుగురు బాలికలు కలిసి ప్రొడక్ట్‌ను అభివృద్ధి చేశారు. వినియోగదారుల నుంచి కూడా మంచి స్పందన రావడంతో తర్వాత హెర్బల్ షాంపూ, హెయిర్ సీరమ్‌ను కూడా తమ ప్రొడక్ట్స్ జాబితాలో చేర్చారు. ప్రస్తుతం హెర్బల్ హెన్నాను కూడా తీసుకొచ్చేందుకు సిద్ధమవుతున్నారు.


**పోటీల్లో సత్తా చాటి రూ. 1 లక్ష గెల్చుకున్నారు!..**

కుశాల్ బిజినెస్ ఛాలెంజ్‌లో ఈ హర్వోల్ ఆయిల్ టీమ్ స్కూల్, బ్లాక్, జిల్లా స్థాయిల్లో మొదటి స్థానాన్ని సాధించింది. రాష్ట్ర స్థాయిలో కూడా టాప్ 10 లో నిలిచింది. ఈ క్రమంలో ఆ బాలికలకు మొత్తం రూ. 1 లక్ష ప్రైజ్‌మనీ లభించింది. రేణుక తెలిపిన వివరాల ప్రకారం జిల్లా స్థాయిలో రూ. 25 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ. 75 వేలు వచ్చాయి. ఈ మొత్తాన్ని ఎవరికి వారు ఖర్చు చేయకుండా వ్యాపారంలోనే పెట్టుబడి పెట్టారు. మొదట ఇంట్లోనే ఉత్పత్తులు తయారు చేసి ప్యాక్ చేసేవారు. అమ్మకాలు పెరగడంతో ఇప్పుడు ఒక షాప్‌ను అద్దెకు తీసుకొని అక్కడి నుంచి ప్రొడక్ట్స్ తయారీ, వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు.

**గ్రామాల్లో ప్రచారం- సోషల్ మీడియాలో మార్కెటింగ్..**

ప్రారంభంలో ఈ బాలికలకు తమ ప్రొడక్ట్స్‌ను విక్రయించడం అంత సాఫీగా ఏం సాగలేదు. నాన్సీతో పాటు టీమ్ సభ్యులు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి హెర్బల్ ఉత్పత్తుల తయారీ విధానం, అందులో ఉపయోగించే పదార్థాల గురించి ప్రజలకు వివరించారు. తర్వాత స్థానిక చిన్న దుకాణాలను సంప్రదించి తమ ఉత్పత్తుల్ని విక్రయించడం ప్రారంభించారు. క్రమంగా కస్టమర్ల నుంచి వచ్చిన రెస్పాన్స్‌తో హర్వోల్ ఉత్పత్తులకు గుర్తింపు పెరుగుతూ వచ్చింది. బాలికలు సోషల్ మీడియాలో హర్వోల్ పేరుతో ఇన్‌స్టాగ్రామ్ పేజీని కూడా క్రియేట్ చేశారు. ఇక్కడ ప్రొడక్ట్స్ ఫొటోలు, వివరాలు, కస్టమర్లు అభిప్రాయాల్ని పంచుకోవడం ద్వారా కొత్త వినియోగదారుల్ని ఆకర్షిస్తున్నారు. హర్వోల్ ఉత్పత్తులకు విదేశాల నుంచి కూడా మంచి స్పందన లభించింది. ఒక కస్టమర్ ఈ హర్వోల్ ప్రొడక్ట్‌ను ఆస్ట్రేలియాలో ఉన్న తన బంధువులకు పంపించారు. అక్కడ కూడా ఈ హెయిర్ ఆయిల్‌కు వస్తున్న స్పందనతో బాలికలపై ప్రశంసలు కురుస్తున్నాయి. తాజాగా ఇటలీ నుంచి కూడా ఆర్డర్ వచ్చినట్లు సియా తెలిపింది. 2025 నవంబరులో తమ వ్యాపారం ప్రారంభమైనప్పటి నుంచి హర్వోల్ ద్వారా దాదాపు రూ. 1 లక్ష ఆదాయం వచ్చిందని దివ్య చెప్పింది. సోషల్ మీడియా ద్వారా వచ్చే ఆర్డర్లు కూడా క్రమంగా పెరుగుతున్నాయని పేర్కొంది. సియా తల్లి రీనా దేవి కూడా వారి సక్సెస్ గురించి మాట్లాడారు. 'నేనేదో ఇంటి అవసరాల కోసం, ఇరుగు పొరుగు వారి కోసం మాత్రమే ఈ నూనెను చేసేదాన్ని. నా కూతురు, ఆమె స్నేహితులు ఈ చిట్కాను పెద్ద బిజినెస్ ఐడియాగా మార్చి విజయం సాధించడం నాకెంతో గర్వకారణంగా ఉంది.' అని సంతోషం వ్యక్తం చేశారు.ఆ బాలికల ప్రకారం ఈ హర్వోల్ హెర్బల్ హెయిర్ ఆయిల్‌లో కలోంజి (నల్ల జీలకర్ర), మెంతులు, భృంగరాజ్ (గుంటగలగరాకు), అతిమధురం వంటి పదార్థాలను ఉపయోగిస్తున్నారు. కరివేపాకు సహా మరికొన్ని పదార్థాలను విద్యార్థులు గ్రామాల చుట్టుపక్కల ఉన్న పొలాల నుంచి సేకరిస్తారు. వాటిని శుభ్రం చేసి సిద్ధం చేసిన తర్వాత నూనెలో వేసి తక్కువ మంటపై తయారు చేస్తారు. చల్లారిన తర్వాత బాటిళ్లలో నింపి ప్యాక్ చేస్తారు. హెర్బల్ షాంపూ ధర రూ. 150 గా ఉంది. కస్టమర్ల నుంచి వస్తున్న సూచనలు, అభిప్రాయాల ఆధారంగా మరిన్ని ఉత్పత్తుల్ని రూపొందించేందుకు బాలికలు ప్రయత్నాలు చేస్తున్నారు.

# నా బిడ్డ ప్లాన్-బి ఏంటో నాకు తెలియదు: కొండా మురళి



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** విశ్వంభర, హైదరాబాద్: తాము కాంగ్రెస్‌ను వీడేది లేదని మంత్రి కొండా సురేఖ భర్త , ఆ పార్టీ నేత కొండా మురళి అన్నారు. ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కొండా మురళి సమావేశమయ్యారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న తాజా పరిణామాల నేపథ్యంలో కీలక నేతలు భేటీ కావడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. ''కొండా సురేఖ అంశం, తాజా రాజకీయ పరిణామాలపై ఈ సమావేశంలో చర్చించలేదు. సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకపై సంపూర్ణ విశ్వాసం ఉంది. మా కుమార్తె సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదు. నా బిడ్డ ప్లాన్‌ఎ ప్రకారం వ్యాఖ్యలు చేసింది. ప్లాన్‌బి ఏమిటో నాకు తెలియదు. మంత్రి సురేఖ మంగళవారం వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేడు కూడా మరో కార్యక్రమానికి హాజరయ్యారు. క్రమశిక్షణ కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడను'' అని కొండా మురళి వ్యాఖ్యానించారు.

# రష్యన్ సీక్రెట్ సర్వీసెస్‌తో అమెరికా నిఘా చీఫ్ భేటీ



**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** మాస్కోలో అమెరికా నిఘా సంస్థ సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ .. రహస్య దౌత్య పర్యటనపై రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ స్పందించింది. ఆయన అధ్యక్షుడు పుతిన్ ను కలవలేదని.. రష్యన్ సీక్రెట్ సర్వీసెస్‌తో సంప్రదింపులు జరిపారని పేర్కొంది. వీటి గురించి పుతిన్‌కు తాము వివరించామని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ తెలిపారు. అయితే ఏ విషయం గురించి చర్చించారో మాత్రం వెల్లడించలేదు. దాదాపు 8 గంటల పాటు సీఐఏ చీఫ్ మాస్కోలో ఉన్నట్లు విమానాల ట్రాకింగ్ డేటా తెలిపింది.2022లో ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి రష్యాను సందర్శించిన అత్యున్నత స్థాయి అమెరికా అధికారులలో జాన్ రాట్‌క్లిఫ్ ఒకరు. కీవ్‌పై మాస్కో దాడులు తీవ్రతరం అవుతున్న తరుణంలో ఈ రహస్య ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా.. సీఐఏ అధిపతులు ఇలా రష్యాలో దౌత్య పర్యటనలు చేపట్టడం తొలిసారి కాదు. బైడెన్ హయాంలో 2021 నవంబరులో నాటి సీఐఏ చీఫ్ విలియం బర్న్స్ మాస్కోలో పర్యటించారు. ఉక్రెయిన్ పై యుద్ధానికి రష్యా సన్నాహాలు చేస్తోన్న సమయంలో ఆ పర్యటన చోటుచేసుకుంది. ఉక్రెయిన్‌పై యుద్ధం జరిపితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన పుతిన్‌ను హెచ్చరించారు. అయినప్పటికీ మాస్కో.. 2022 ఫిబ్రవరిలో కీవ్‌పై సైనిక చర్య ప్రారంభించింది.



బడంగ్‌పేట్‌లో సీకేఆర్ & కేటీఆర్ కన్వెన్షన్ హాల్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక ఛైర్మన్ డా. కాచం సత్యనారాయణ, సోమిశెట్టి శ్రీనివాస్, సోమిశెట్టి సురేశ్, లక్ష్మణ్, కిషన్ గుప్త, కూర రమేశ్, కన్వెన్షన్ హాల్ యజమానులు సుదిశెట్టి శ్రీనివాస్, సుదిశెట్టి సురేశ్ తదితరులు.




రవీంద్ర భారతిలో నిర్వహించిన ఆదాబ్ హైదరాబాద్ దినపత్రిక 15వ వార్షికోత్సవానికి హాజరైన వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక ఛైర్మన్ డా. కాచం సత్యనారాయణ.



చంపాపేట్‌లోని సామ నర్సింహారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన చెన్‌రెడ్డి మణెమ్మ ద్వాదశ దినకర్మ కార్యక్రమంలో మణెమ్మ ఘననివాళులర్పిస్తున్న వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక ఛైర్మన్ డా. కాచం సత్యనారాయణ, చెన్‌నెడ్డి మణెమ్మ కుమారుడు చెన్‌రెడ్డి సురేష్ రెడ్డి, శ్రీనివాస్, కూర రమేశ్, ఇరుగు శ్రీధర్, రంగారెడ్డి తదితరులు.

### ద్వాదశ జ్యోతిర్లింగేశ్వర ఆలయంలో

# వైభవంగా కళ్యాణ మహోత్సవం



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** పెద్ద శంకరంపేట పట్టణ శివారులోని ద్వాదశ జ్యోతిర్లింగేశ్వర ఆలయంలో బుధవారం శ్రీ అన్నపూర్ణ సమేత కాశి విశ్వేశ్వర దేవత కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో ద్వాదశ జ్యోతిర్లింగేశ్వర ఆలయ శిఖర ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పందిరిలో అన్నపూర్ణ సమేత కాశి విశ్వేశ్వర దేవత కళ్యాణ మహోత్సవం వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్చారణలతో వైభవంగా జరిపించారు. ఆలయంలో. పుణ్యాహవాచనము. అఖండ దీప స్థాపనము. గణపతి పూజ. వాస్తు నవగ్రహ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కళ్యాణ మహోత్సవం తిలకించడానికి అధిక సంఖ్యలో మహిళలు భక్తులు తరలివచ్చారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు చేశారు. అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు కొత్త ప్రభులు. . దాదిగారి గంగాధర్. కందుకూరి నర్సింలు. గడ్డం వెంకటేశం. కందుకూరి రవీందర్ . పి సంతోష్.. రాఘవులు. రాజు. శివశంకర్ అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# విజన్-40 జూనియర్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే

### కళాశాల చైర్మన్ నవనీతరావు




**విశ్వంభర, హనుమకొండ :** హనుమకొండ పట్టణంలోని విజన్40 జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థులు డ్యాన్సులు, పాటలతో సందడి చేసి ఉత్సాహభరిత వాతావరణాన్ని నెలకొల్పారు. కళాశాల ప్రిన్సిపాల్ సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ నవనీతరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి, ఇష్టపడి చదివితే తమ లక్ష్యాలను సాధించవచ్చని అన్నారు. కళాశాల స్థాపించిన నాటి నుంచి ఇప్పటివరకు విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ఐటీ, నీట్ వంటి ప్రతిష్ఠాత్మక ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించడం గర్వకారణమన్నారు. విద్యార్థులు ఉన్నత ర్యాంకులు సాధించడంలో అధ్యాపకుల కృషితో పాటు తల్లిదండ్రుల సహకారం కూడా ఎంతో ఉందని నవనీతరావు గుర్తు చేశారు. అనంతరం ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను మేమెంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు అనుమాండ్ల నారాయణరెడ్డి, డాక్టర్ పొడేటి కోటేశ్వరరావు, సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు ఆసిస్, శక్తి, రాంకుమార్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళ అదృశ్యం



**విశ్వంభర, సరూర్ నగర్ :** మహిళా అదృశ్యమైన సంఘటన సరూర్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చంపాపేట్ నేతాజీ నగర్ లో నివాసముండే కె. భవాని (26) ప్రైవేటు జాబు చేస్తున్నది.డ్యూటి కి వెళ్తున్నాను అని చెప్పి వెళ్ళి రాత్రి అయిన ఇంటికి రాకపోయే సరికి ఆమె భర్త నరేష్ గౌడ్ ఆమె ఫోన్ నంబర్ కి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో చుట్టుప్రక్కల బంధువుల వద్ద విచారించగా ఎక్కడ తన ఆచూకీ తెలవకపోవడంతో ఆమె భర్త ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# గ్రామ సభలు – ఓటర్ల క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ

**○ తహసిల్దార్ పి. వేణుగోపాల్**



**విశ్వంభర, సరూర్ నగర్ :** ముసాయిదా ఓటర్ల జాబితాకు సంబంధించి క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ , విచారణ ప్రక్రియలో భాగంగా సరూర్‌నగర్‌లో గురువారం ఉదయం 9.00 గంటల నుంచి ఐదు ప్రాంతాల్లో గ్రామ సభలు నిర్వహించబడనున్నాయి అని సరూర్ నగర్ తహసిల్దార్ పి. వేణుగోపాల్ తెలిపారు.

1. ప్రభుత్వ జూనియర్ కళాశాల, సరూర్‌నగర్
2. సీనియర్ సిటిజన్ న్యూ బిల్డింగ్, హుడా కాంప్లెక్స్
3. క్రాంతినగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనం
4. సీనియర్ సిటిజన్ భవన్, డాక్టర్స్ కాలనీ
5. బస్తీ దవాఖానా, భగత్‌సింగ్ నగర్ ప్రాంతాలలో గ్రామసభలు నిర్వహించబడతాయని తెలిపారు.

ఓటర్ల జాబితా పరిశీలనలో మ్యాపింగ్ కాని ఓటర్లందరూ సంబంధిత గ్రామ సభకు హాజరై తమకు సంబంధించిన నోటీసులను స్వీకరించవచ్చు. మ్యాపింగ్ కాని ఓటర్లు సమర్పించాల్సిన అవసరమైన పత్రాలు, ఆధారాల వివరాలను సంబంధిత బి ఎల్ ఓ లు వారికి వివరిస్తారు. అవసరమైన పత్రాలను సమర్పించి తమ క్లెయిమ్‌ను నమోదు చేసుకోవచ్చు.

మ్యాపింగ్ అయినప్పటికీ ఏవైనా లోపాలు , అసమానతలు గుర్తించబడిన ఓటర్లు కూడా గ్రామ సభకు హాజరై సంబంధిత నోటీసులను స్వీకరించి, అవసరమైన వివరణలు , పత్రాలను సమర్పించవచ్చు. కొత్తగా ఓటరుగా నమోదు కావాలనుకునే అర్హత కలిగిన పౌరులు ఫారం6 సమర్పించవచ్చు. ఓటరు పేరు తొలగింపుకు ఫారం7, ఓటరు వివరాల్లో మార్పులు, సవరణలు లేదా నివాసం మార్పు కోసం ఫారం8 సమర్పించవచ్చు.

ముసాయిదా ఓటర్ల జాబితాపై వచ్చిన అన్ని క్లెయిమ్స్ , అభ్యంతరాలను గ్రామ సభల్లో విచారించనున్నారు. సంబంధిత ఎలక్టోరల్ రోల్ సూపర్‌వైజర్లు , బూత్ లెవల్ అధికారులు ఆయా గ్రామ సభల వద్ద ఉదయం 9 గంటల నుంచి అందుబాటులో ఉండి, ఓటర్ల నుంచి క్లెయిమ్స్, అభ్యంతరాలు , సంబంధిత దరఖాస్తులను స్వీకరించి అవసరమైన సహాయాన్ని అందిస్తారు.

రిపోర్టర్లు కావలెను

V3 NEWS
ప్రజా "విశ్వంభర"
తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి x రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108